క్లుప్తంగా

సామూహిక శ్రీవిష్ణుసహస్ర నామ పారాయణం



జగ్గయ్యపేట అర్బన్: జ్యేష్ఠమాసం శుక్ల పంచమి ఆదివారం సందర్భంగా పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లోని శ్రీస్వయంవ్యక్త పాత వెంకటేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. చౌడవరపు కుటుంబీకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జెండా దిమ్మె ఏర్పాటుకు శంకుస్థాపన



కొత్తపేట(కంచికచర్ల): మండలంలోని కొత్తపేటలో ఏర్పాటు చేయనున్న ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మె పనులకు అసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిమూలపు సురేష్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు మందా పిచ్చయ్య మాదిగ ఆదివారం శంకుస్థాపన చేశారు. తొలుత మాజీ సర్పంచి ముప్పాళ్ల నాగేశ్వరరావు భూమిపూజ చేశారు.ఈసందర్భంగా ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ మాదిగ జాతి అభ్యున్నతికి మంద కృష్ణమాదిగ అహర్నిశలు పోరాటం చేశారని కొనియాడారు. కృష్ణమాదిగ బాటలో మాదిగ బిడ్డలంతా నడుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కంచికచర్ల మండల అధ్యక్ష్యుడు మార్కపూడి రామారావు, నాయకులు జిల్లేపల్లి సంగమేశ్వరరావు, పులి గోపిచంద్, ముప్పాళ్ల హనుమయ్య, కోట వెంకట్, పులి రాజశేఖర్ పాల్గొన్నారు. అదేవిధంగా నాయకులు మండలంలోని చెవిటికల్లులోని ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలతో కలసి వర్గీకరణ జరిగిన తీరుపై చర్చించారు.

కాశీవిశ్వేశ్వరునికి బిళ్వార్చన పూజలు



నందిగామ రూరల్: మండలంలోని రుద్రవరంలో వేంచేసియున్న అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శంకర భారతీ సనాతన సభ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, బిళ్వార్చన పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ చైర్మన్ వేజండ్ల గోపి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథ ప్రచారం



అన్నవరం(జగ్గయ్యపేట): జూలై నెలలో జరిగే గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని అన్నవరం గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు పోటు వెంకటేశ్వర్లు, సభ్యులు వంగా మహేష్, విజయ, సైదా, రమేష్, ముత్తవరపు శైలజ, జాస్తి శివరామకృష్ణ, ధైద శ్రీనివాస్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో పాటు ఆషాడమాసం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. అమ్మవారు ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేదతీరారు.

అమ్మవారికి బోనాలు సమర్పణ..

ఆషాఢమాసం సందర్భంగా శ్రీతిరుపతమ్మ అమ్మవారికి ఆదివారం వడ్డెర కులస్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దసంఖ్యలో మహిళలు బోనాలు తెచ్చి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని వివరించారు.



బోనాలతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేకాలంకరణలో శ్రీతిరుపతమ్మవారు



అమ్మవారికి బోనాలు తెస్తున్న మహిళలు



క్యూలైన్‌లో భక్తుల రద్దీ



ఆలయం బయట భక్తుల సందడి

కనులపండువగా సారె సమర్పణ

వీరులపాడు: మండలంలోని నరసింహారావు పాలెంలోని అగస్త్య పీఠంలో వేంచేసియున్న గాయత్రి అమ్మవారికి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మహిళలు ఆదివారం పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ఆషాడం సారె సమర్పించారు. పీఠాధిపతి సుగుణానంద స్వామీజీ ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు, సారె సమర్పణ కార్య క్రమాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకా లు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చనలు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వామీజీ అన్ని ఏర్పాట్లు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..

అగస్త్య పీఠంలోని గాయత్రీమాతను పలువురు ప్రముఖులు దర్శించుని ప్రత్యేక పూజలు చేశారు. నందిగామ మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి నందిని విక్రమార్క, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను తదితరులు అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో పాడి పంటల సమృద్ధిగా పండి రైతులు, ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారికి సారె సమర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, నాయకులు పచ్చాల కోటేశ్వరరావు, బొమ్మిశెట్టి భాస్కరరావు, పసుపులేటి సాయిబాబు, గ్రామస్తులు, భక్తులు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



అగస్త్యపీఠంలోని గాయత్రి మాతకు పూజలు చేస్తున్న మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు



సామూహిక కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు

కంచిలమ్మకు వరదపాశం

కంచికచర్ల: కంచికచర్లలోని కంచిలమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం వరద పాశం పోశారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి వరదపాశం పోస్తే సకాలంలో వర్షాలు కురుస్తాయని, వ్యవసాయ పంట ఉత్పత్తులు బాగా పెరుగుతాయని భక్తుల విశ్వాసం. భక్తులు ట్రాక్టర్లు, కార్లు, బైక్‌ల ద్వారా అమ్మవారి సన్నిధికి చేరుకుని వరదపాశం పోసారు. అమ్మవారి సన్నిధిలో పొంగళ్లు, పాయసం వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కొంతమంది భక్తులు జలబిందెలతో అమ్మవారికి అభిషేకం చేశారు.

ముత్యాలమ్మకు వరదపాశం..

వీరులపాడు: వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో కళకళలాడాలని కోరుతూ ముత్యాలమ్మ అమ్మవారికి గ్రామస్తులు వరద పాశం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని చౌటపల్లిలో ఆదివారం అమ్మవారికి మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి బోనాలను సమర్పించారు. అనంతరం వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మద్దినేని రామకృష్ణ, మట్టూరి వెంకటరామారావు, పెద్దసంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కంచిలమ్మ అమ్మవారు

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

జగ్గయ్యపేటఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట (2025-26) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఎన్నికల అధికారి, జోన్ చైర్మన్ రాజాకేశవప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ నూతన అధ్యక్షులుగా శ్రీరాం బదరీనారాయణ, కార్యదర్శిగా షేక్ ఖాసింసైదా, కోశాధికారిగా బండారు రవికుమార్, ఉపాధ్యక్షులుగా కరుణాకర్, మహేష్, మెంబర్‌షిప్ చైర్మన్‌గా మోహన్ బాబు, క్లబ్ కోఆర్డినేటర్‌గా మేజర్ సత్యనారాయణ, సర్వీస్ చైర్‌పర్సన్‌గా పసుపులేటి ప్రసాద్, కమ్యూనికేషన్ చైర్మన్‌గా నారాయణరెడ్డి, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా డాక్టర్ రాజాకేశవప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి క్లబ్ సభ్యులు అభినందనలు తెలియజేశారు.



బదరీనారాయణ



షేక్ ఖాసింసైదా

రేపు డాక్టర్స్ డే వేడుకలు..

జూలై 1 వ తేదీన డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఆరుగంటలకు డాక్టర్స్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు క్లబ్ కార్యదర్శి షేక్ ఖాసిం సైదా తెలిపారు. కోదాడ రోడ్డులోని మున్సిపల్ ఇండోర్ స్టేడియం వద్ద ఉన్న క్లబ్ కమ్యూనిటీ భవన్‌లో పలువురు డాక్టర్లను సత్కరించనున్నట్లు వివరించారు.

జాతీయ సమావేశాలకు రాఘవేంద్ర ఎంపిక



జగ్గయ్యపేటఅర్బన్: హర్యానాలోని గురుగ్రామ్‌లో జూలై మూడోతేదీ నుంచి రెండురోజులపాటు స్థానిక సంస్థల చైర్మన్లకు నిర్వహించనున్న జాతీయ సమావేశాలకు రాష్ట్రప్రభుత్వంలో ఆయా స్థానికసంస్థల నుంచి పలువురు మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లను ఎంపిక చేసింది. ఎంపికైన వారిలో జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కూడా ఉన్నారు.జాతీయ సమావేశాలకు హాజరుకానున్న ఈ బృందానికి నోడల్ ఆఫీసర్‌గా రాజమండ్రి మున్సిపల్‌శాఖ రీజనల్ డైరెక్టర్ నాగనరసింహారావు వ్యవహరించనున్నారని చైర్మన్ రాఘవేంద్ర తెలిపారు.

హామీల అమలులో కూటమి విఫలం : బీఎస్పీ

నందిగామరూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కూటమి ప్రభుత్వ పూర్తిగా విఫలమైందని బీఎస్పీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వానికి రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రం స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు చేపట్టిన పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని నాయకులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. జూలై ఆరోతేదీన విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య భవన్‌లో జరిగే పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఆపార్టీ నాయకులు గంగవరపు దేవ, యరగొర్ల ఉదయ్‌కిరణ్‌యాదవ్, దాసరి కృష్ణ, గాలంకి వెంకటేశ్వరరావు, అశోక్, మల్లయ్య, దున్నా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పుష్పరాజ్

అధ్వానంగా పీహెచ్‌సీ రోడ్డు

- నడిచేందుకు సైతం వీలులేని వైనం..
- వర్షం పడితే పరిస్థితి మరింత దైన్యం
- అడుగడుగునా గోతులమయం
- ఇబ్బందుల్లో రోగులు, ప్రజలు

కంచికచర్ల: మండల కేంద్రం కంచికచర్లలోని పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండటంతో గర్భిణులు, బాలింతలు, రోగులు అవస్థలుపడుతున్నారు. పెద్దపెద్ద గోతులుండటంతో ఈ రోడ్డులో వెళ్లాలంటనే గర్భిణీ, బాలింతలు భయాందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్డంతా బురదకయ్యగా మారుతుండటంతో బైక్‌లు స్కిడ్ అవుతూ వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డులో వీధిలైట్లు కూడా లేకపోవడంతో రాత్రి సమయంలో వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఇదేరోడ్డులో ఉన్న మోడల్‌కాలనీ, ఇందిరాకాలనీ ప్రజలతోపాటు మండలంలోని గొట్టుముక్కల గ్రామానికి ప్రజలు, విద్యార్థులు నిత్యం రాకపోకలు ప్రయాణిస్తుంటారు. వీరంతా రోజూ తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఈరోడ్డులో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డు సరిగాలేకపోవడంతోపాటు ఈ పీహెచ్‌సీ కూడా పట్టణానికి దూరంగా ఉండటంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులనే ఆశ్రయిస్తుండటం గమనార్హం. ఇకనైనా పాలకులు స్పందించి గోతులమయమైన ఈ రోడ్డు అభివృద్ధికి కృషిచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అభివృద్ధికి నోచుకోని కంచికచర్ల పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఆయా సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

4న సీపీఐ మహాసభలు



సీపీఐ నియోజకవర్గ మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ నేతలు

జగ్గయ్యపేట అర్బన్: జూలై 4వతేదీన నిర్వహించనున్న సీపీఐ జగ్గయ్యపేట నియోజకవర్గ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జగ్గయ్యపేట పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ డిపోవద్ద ఉన్న పిల్లలమర్రి భవన్‌లో సీపీఐ నియోజకవర్గ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ పార్టీ శ్రేణులు కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆ పార్టీ పేట పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు, నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ మాట్లాడుతూ నిత్యం ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సభల్లో పలుసమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమాన్ని నిర్మించుకునేలా ఈ మహాసభ వేదిక కానుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ పట్టణ నాయకులు పోతిపాక వెంకటేశ్వర్లు, షేక్ అసదుల్లా, మాశెట్టి రమేష్, మెటికల శ్రీనివాసరావు, నీలకంఠం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

నందిగామటౌన్: నందిగామ మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని సోమవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ లోవరాజు ఆదివారం తెలిపారు.పట్టణంలోని బాబుజగ్జీవన్‌రాం భవన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు హాజరుకావాలని ఆయన కోరారు.

ఈత పోటీల్లో కాకతీయ విద్యార్థుల ప్రతిభ



నందిగామ టౌన్: హైదరాబాద్‌లో పుల్లెల గోపీచంద్ అకాడమీలో ఈనెల 28నుంచి రెండురోజులపాటు నిర్వహించిన ఈత పోటీల్లో కాకతీయ స్విమ్మింగ్ అకాడమీ విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచారు. 25 మీటర్ల ఈత పోటీల్లో కాకతీయ విద్యార్థులు పాల్గొని 18పతకాలు సాధించినట్లు అకాడమీ ప్రతినిధులు తెలిపారు. విజేతలతోపాటు స్విమ్మింగ్ అకాడమీ కోచ్ గోపీచంద్‌కు కాకతీయ విద్యా సంస్థల చైర్మన్ కాపా రవీంద్రనాథ్ అభినందనలు తెలియజేశారు. విజేతలను అభినందించినవారిలో డైరెక్టర్స్ కాపా భారతి, కార్తికేయ, స్ఫూర్తి, సుష్మ, ప్రిన్సిపాల్ సత్యమూర్తి, మేనేజర్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు

విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు తెలిపారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం సినీ సంగీత విభావరి, గాయకుడు మేకల పురోషత్తమ ప్రసాద్‌కు బహుగళ కళానిధి పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ గాయకుడు ప్రసాద్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు సంస్థ లక్ష్యాలను వివరించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ గాయనీ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. గాయనీ గాయకులు పలు చిత్ర గీతాలను ఆలపించారు. పురుషోత్తమ ప్రసాద్‌కు బహుగళ కళానిధి పురస్కారం అందించారు.

మహాప్రస్థానం కవితా సంపుటి పెనుసంచలనం

విశ్రాంత కలెక్టర్ మహ్మద్ ఇంతియాజ్

విజయవాడ కల్చరల్: ప్రజాకవి శ్రీశ్రీ అని విశ్రాంత కలెక్టర్ మహ్మద్ ఇంతియాజ్ అన్నారు. జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి శ్రీశ్రీ సాహిత్యనిధి ఆధ్వర్యంలో న్యాయవాది వేములపాటి పట్టాభికి ఆత్మీయ సత్కారం, శ్రీశ్రీ మహాప్రస్థానం గ్రంథాల బహూకరణ కార్యక్రమాన్ని ఆదివారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో వేములపాటి అనంతరామయ్య కళావేదికమీద నిర్వహించారు. ఇంతియాజ్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మహాప్రస్థానం కవితా సంపుటి పెనుసంచలనం కలిగించిందని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ శ్రీశ్రీకి అంతరంగిక శిష్యులు కొంతమంది ఉన్నారని వారిలో వేముల పాటి అనంతరామయ్య ఒకరన్నారు. శ్రీశ్రీ సాహిత్య నిధి నిర్వాహకుడు సింగంపలిల అశోక్ కుమార్ శ్రీశ్రీ సాహిత్యాన్ని అభిమానులకు అందిస్తునట్లు తెలిపారు. సింగంపల్లి అశోక్‌కుమార్ శ్రీశ్రీ సాహిత్యపు విలువలు అంశంగా ప్రసంగించారు. న్యాయవాది వేములపాటి పట్టాభిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. న్యాయవాది మోహన్ రాంప్రసాద్ మహాప్రస్థానం గీతాన్ని గాయకుడు సుదర్శన్ రాజు శ్రీశ్రీ సినిమా పాటలను ఆలపించారు. గ్రంథాలయానికి శ్రీశ్రీ నిలువెత్తు మహాప్రస్థానం పుస్తకాన్ని అందించారు.



న్యాయవాది పట్టాభిని సత్కరిస్తున్న నిర్వాహకులు